క్లుప్తంగా

18న సమర్థనం ట్రస్ట్ ఆధ్వర్యంలో జాబ్ మేళా

నెహ్రూనగర్: నిరుద్యోగ యువత కోసం 18న మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు సమర్థనం ట్రస్ట్ రీజినల్ మేనేజర్ శ్రీనివాస్ బుధవారం తెలిపారు. గుంటూరు గోరంట్ల హోసన్నా మందిరం ఎదురు ఉన్న ట్రస్ట్ ఆఫీసు ప్రాంగణంలో ఆ రోజు ఉదయం 9:30 గంటల నుంచి ఇంటర్వ్యూలు జరుగుతాయని పేర్కొన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, పీజీ చదివిన 18 నుంచి 35 సంవత్సరాల వయసున్న వారు అర్హులని తెలియజేశారు. రెజ్యూమ్, ఆధార్ కార్డు జిరాక్స్, విద్యార్హత ధ్రువపత్రాలు తీసుకొని ఇంటర్వ్యూకి హాజరుకావాలని ఆయన సూచించారు. ఆసక్తి గలవారు 6364867800 ,6364867801 ,6364867802 నంబర్లకు ఫోన్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

క్యాష్ కౌంటర్‌లో నగదు చోరీ

గుంటూరు ఈస్ట్: హోటల్‌లోని క్యాష్ కౌంటర్‌లో నగదు చోరీపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. జీటీ రోడ్డులోని సుభాని హోటల్‌లో బుధవారం ఉదయం శ్రీనివాసరావు గత రాత్రి ఉంచిన డబ్బుల కోసం కౌంటర్ పరిశీలించారు. అందులోని రూ. 1.20 లక్షలు కనిపించలేదు. చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వీవీఐటీలో 'మై నేమ్ ఈజ్ శృతి' చిత్ర బృందం సందడి



పెదకాకాని: హన్సికా కీలక పాత్రలో ఓంకార్ శ్రీనివాస్ దర్శకత్వంలో వైష్ణవి ఆర్ట్స్ పతాకంపై రూపొందుతున్న లేడీ ఓరియంటెడ్ 'మై నేమ్ ఈజ్ శృతి' చిత్ర బృందం వీవీఐటీలో సందడి చేసింది. ఈ నెల 17 న విడుదల కానున్న దృష్ట్యా చిత్ర ప్రచారంలో భాగంగా బృందం బుధవారం నంబూరు వీవీఐటీని సందర్శించింది. ఈ సందర్భంగా దర్శకుడు శ్రీనివాస్ మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న వాస్తవ ఘటనలను స్ఫూర్తిగా తీసుకుని ఈ చిత్రాన్ని రూపొందించామని తెలిపారు. మహిళలు పురుషుల కంటే బలమైన వ్యక్తిత్వాన్ని కలిగి ఉంటారన్నదే ఈ చిత్ర సారాంశమని వివరించారు. హీరోయిన్ హన్సికా మాట్లాడుతూ కమర్షియల్ హంగులతో సామాజిక అంశాన్ని ప్రేక్షకులకు తెలియజేయడమే ఈ చిత్రం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. అనంతరం చిత్ర బృందం విద్యార్థులతో కలసి నృత్యాలు, సెల్ఫీలతో సందడి చేసింది. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై. మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

నేడు కొత్తరెడ్డిపాలెంలో బజరంగ్ నేత్రజ్యోతి కళ్లజోళ్ల పంపిణీ



బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ

చేబ్రోలు: దృష్టి లోపం సమస్య మాత్రమే కాదని, మనిషికీ – ప్రపంచానికీ మధ్య అడ్డుగోడ వంటిదని, దీన్ని పటాపంచలు చేసే దిశగా బజరంగ్ ఫౌండేషన్ నేత్ర జ్యోతి పేరిట నిర్విరామ కృషి చేస్తున్నట్లు వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ తెలిపారు. చేబ్రోలు మండలం కొత్తరెడ్డిపాలెంలో నవంబర్ 12న బజరంగ్ జగన్నామ సంక్షేమ సంవత్సరంలో భాగంగా నిర్వహించిన నేత్రజ్యోతి శిబిరంలో అవసరమైన 791మందికి కళ్లజోళ్లను సిద్ధం చేశామని పేర్కొన్నారు. కొత్తరెడ్డిపాలెంలోని యంగ్ ఇండియా స్కూలు ప్రాంగణంలో గురువారం సాయంత్రం 3 గంటల నుంచి 5 గంటల వరకు మహిళలకు, 5 గంటల ఉంచి 7 గంటల వరకు పురుషులకు కళ్లజోళ్లను పంపిణీ చేస్తామని ఆయన వెల్లడించారు. బజరంగ్ నేత్రజ్యోతి శిబిరంలో కళ్లజోళ్ల ఆవశ్యకతను గుర్తించిబడిన వారు అందుబాటులో ఉండి వాటిని పొందాలని ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ కోరారు.

తూకంలో తేడాలుంటే కఠిన చర్యలు

చేబ్రోలు: గ్యాస్, పెట్రోలు, సరుకుల తూకంలో తేడాలు ఉన్నా, ఎమ్మార్పీ కన్నా ఎక్కువ ధరలకు అమ్మినా కఠిన చర్యలు తీసుకుంటామని గుంటూరు లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ జి. కొండారెడ్డి తెలిపారు. చేబ్రోలులోని భారత్ గ్యాస్ కంపెనీ, చేబ్రోలు, మంచాల గ్రామాల్లోని నాలుగు పెట్రోలు బంక్‌లు, ఎరువులు, పలు కిరాణా షాపుల్ని బుధవారం తూనికలు, కొలతల శాఖాధికారులు తనిఖీ చేసి, నాలుగు కేసులు నమోదు చేశారు. పెట్రోలు బంకులు, గ్యాస్ కంపెనీ వద్ద సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కంట్రోలర్ జి. కొండారెడ్డి మాట్లాడుతూ పెట్రోలు బంక్‌లు, గ్యాస్ కంపెనీ మీద పలు ఫిర్యాదులు అందటంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. గ్యాస్ వినియోగదారుల నుంచి అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని చెప్పారు. భారత్ గ్యాస్ కంపెనీలో సిలెండర్ల తూకంలో సమస్య లేదని, ఐదు కి.మీ.లోపు గ్యాస్ వినియోగదారులు అదనంగా చెల్లించాల్సిన అవసరం లేదని చెప్పారు. 15కి.మీ.లోపు రూ.20, తరువాత రూ.30 వరకు అదనంగా వసూలు చేయాలని తెలిపారు. తనిఖీలో తూనికలు, కొలతల శాఖాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'స్వచ్ఛ గుంటూరు' ప్రతి ఒక్కరి బాధ్యత

కమిషనర్ కీర్తి చేకూరి



అధికారులతో సమావేశమైన కమిషనర్

నెహ్రూనగర్: స్వచ్ఛ గుంటూరు సాధన ప్రతి ఒక్కరి బాధ్యతని, గార్బేజ్ ఫ్రీ (చెత్త రహిత) సిటీ లక్ష్యంగా ప్రజా భాగస్వామ్యంతో కృషి చేయాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ప్రజారోగ్య అధికారులకు స్పష్టం చేశారు. తన చాంబర్‌లో బుధవారం ప్రజారోగ్య విభాగ, ఇంజినీరింగ్ అధికారులతో నగరంలో పారిశుద్ధ్య పనులు, ఇంటింటి చెత్త సేకరణ, తరలింపులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో పారిశుద్ధ్య పనులు పక్కాగా జరగాలని ఆదేశించారు. కార్మికులు, శానిటేషన్ కార్యదర్శులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు మరింత బాధ్యతగా పిన్ పాయింట్ ప్రకారం విధులు నిర్వహిస్తే స్వచ్ఛ నగరంగా గుంటూరు మారుతుందని తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతో ఇంటింటి చెత్త సేకరిస్తూ, వ్యర్థాల్ని రోడ్లపై, కాల్వల్లో వేయకుండా చర్యలు తీసుకుంటే గార్బేజ్ ఫ్రీ సిటీ అవుతుందని పేర్కొన్నారు. ప్రతి ఇంటి నుంచి వ్యర్థాల్ని తడి, పొడిగా ఇచ్చేలా కార్యదర్శులు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రధాన కాల్వల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు లేకుండా చూడాలని, వాటిని వేసే షాప్స్‌ని సీజ్ చేయాలని స్పష్టం చేశారు. వీధి వ్యాపారుల నుంచి చెత్త సేకరణకు ప్రత్యేక సమయం కేటాయించాలని, రోడ్ల మీద వ్యర్థాలు వేసే వారికి అపరాధ రుసుం విధించాలని చెప్పారు. కమర్షియల్ సంస్థల నుంచి కాంట్రాక్టర్లు ప్రతి రోజు వ్యర్థాల్ని సేకరణ చేస్తుంది, లేనిది పరిశీలించాలని సూచించారు. ఇంటింటి చెత్త సేకరణ చేసే సమయంలోనే ఆర్ఎఫ్ఐడీ ట్యాగ్ లను స్కాన్ చేయాలని, స్కానర్లు మరమ్మతు ఉంటే వెంటనే చేయించాలని ఆదేశించారు. డివిజన్ల వారీగా రూట్ మ్యాప్ ప్రకారం చెత్త తరలింపునకు వాహనాలు వచ్చేలా వెహికిల్ షెడ్ అధికారులు చూడాలని, ఎక్కడైనా సమస్య ఏర్పడితే యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని తెలిపారు. స్వీపింగ్ యంత్రాల పనితీరుపై రోజువారి నివేదిక ఇవ్వాలని తెలియజేశారు. ఈ–ఆటోలు పక్కాగా పని చేసేలా చార్జింగ్ పాయింట్స్‌లో సమస్యలు లేకుండా ఇంజినీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఆటోలకు జీపీఎస్ ట్రాకర్లు ఉండాలని ఆదేశించారు. సమావేశంలో ఎస్ఈ భాస్కర్, డెప్యూటీ కమిషనర్ రవీంద్ర, ఎంహెచ్‌వో డాక్టర్ భానుప్రకాష్, ఈఈ కొండారెడ్డి, డీఈఈ శ్రీనివాసరెడ్డి, ఏఈ దుర్గా ప్రసాద్, బయాలజిస్ట్ మధుకుమార్, ఎస్ఎస్‌లు రాంబాబు, ఆనందకుమార్, ఆయుబ్‌ఖాన్ పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే సీఎం జగన్ లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న నూరి ఫాతిమా

పట్నంబజారు: నా ఎస్సీ.. నా ఎస్టీ... నా బీసీ.. నా మైనార్టీ అనే నినాదంతో పాటు మహిళా సాధికారతకు కృషి చేసిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరి ఫాతిమా అన్నారు.తూర్పు నియోజకవర్గంలోని ఐదో వార్డులో బుధవారం 'ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలి' అనే కార్యక్రమం నిర్వహించారు. నూరి ఫాతిమా మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా సీఎం రూ.2.32లక్షల కోట్లను అందించారని తెలిపారు. కోవిడ్ సమయంలోనూ సంక్షేమ పథకాలు అందించిన ఘనత ఆయనకే దక్కుతుందని చెప్పారు. చంద్రబాబుకు ప్రజల సంక్షేమం పట్టదని విమర్శించారు. ఆయన పాలన అంతా మోసాలు, వెన్నుపోట్లు, అబద్ధాలేనని తెలిపారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉండి ఒక్కటైనా మంచి కార్యక్రమం చేపట్టలేదని ధ్వజమెత్తారు. కుప్పం ప్రజలకే నీళ్లు ఇవ్వని చంద్రబాబు ఇతర ప్రాంతాలను బాగు చేస్తారా? అని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు యాట్ల రవి, సంకూరి శ్రీను, పార్టీ ముఖ్య నాయకులు ఫారూక్, హన్నూ, ఆవుల శ్రీను, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

జాతి గర్వించదగ్గ నేత బిర్సా ముండా



బిర్సా ముండా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న బీజేపీ నేతలు

గుంటూరు మెడికల్: జాతి గర్వించదగ్గ నేత బిర్సా ముండా అని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ కొనియాడారు. స్వాతంత్ర్య సమరయోధుడు, ఆదివాసీ నాయకుడు బిర్సా ముండా జయంతి వేడుకల్ని చంద్రమౌళీనగర్‌లోని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా బిర్సా ముండా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వల్లూరు జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ భూమి హక్కుల కోసం పోరాటం చేసిన మహాయోధుడు బిర్సా ముండా అని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర, జిల్లా ఇన్‌చార్జి శ్రీనివాసరాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యడ్లపాటి స్వరూపరాణి, ఈదర శ్రీనివాసరెడ్డి, రాయ నాగేశ్వరావు, అనుమోలు ఏడుకొండలు, గూడూరు రాంబాబు, నాగమల్లేశ్వరి, వెంకటేష్ యాదవ్, దర్శి నరసింహారావు, నరేంద్ర షా, బజరంగ్ రామకృష్ణ పాల్గొన్నారు.

ఉచిత ఆయుర్వేద శిబిరానికి స్పందన



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు

గుంటూరు మెడికల్: శ్రీ వెంకటేశ్వర ఆయుర్వేదిక హాస్పిటల్, కేరళ పంచకర్మ స్పెషాలిటీ వారి అనుబంధ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. గుంటూరు జిల్లా కోర్టు ప్రాంగణంలోని బార్ అసోసియేషన్ హాలులో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయుర్వేదం ఎంతో పురాతనమైన వైద్య విధానమన్నారు. ఆయుర్వేద మందులతో ఎలాంటి సైడ్ ఎఫెక్టు ఉండదని తెలిపారు. మొదటి అడిషనల్ జడ్జి రాజగోపాల్ మాట్లాడుతూ ఆయుర్వేద వైద్యం ద్వారా ఎన్నో సమస్యలకు పరిష్కారం లభిస్తోందని చెప్పారు. శిబిరంలో 300 మంది న్యాయవాదులకు ఉచిత పరీక్షలు చేసి, రూ. 25వేలు ఖరీదు చేసే మందులు ఉచితంగా అందజేసినట్లు డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు తెలిపారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా బార్ అసోషియేషన్ ప్రెసిడెంట్ రమేష్, హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్. కె.వి.కె. సురేష్, డాక్టర్ ధనలక్ష్మి, డాక్టర్ సుస్మిత, డాక్టర్ హరికృష్ణ, డాక్టర్ శ్రావణ్, మేనేజర్ మల్లీశ్వరి పాల్గొన్నారు.

మిర్చిలో తెల్లదోమ ఉధృతిపై అప్రమత్తత అవసరం



మిర్చి పంటను ఆశించిన తెగుళ్లను పరిశీలిస్తున్న ఉద్యాన అధికారి ఎం. బేబి

ప్రత్తిపాడు: మిరపలో తెల్లదోమ ఉధృతి అధికంగా ఉందని, రైతులు వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని ఉద్యాన అధికారి ఎం. బేబి సూచించారు. వట్టిచెరుకూరు మండలం వింజనంపాడు, చమళ్లమూడి గ్రామాల్లో మిరప పొలాల్ని బుధవారం సాయంత్రం ఆమె పరిశీలించారు. రైతులతో మాట్లాడి, సాగులో ఎదురవుతున్న సమస్యల్ని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెల్లదోమ వల్ల జెమిని వైరస్ వ్యాపిస్తుందని తెలిపారు. ఆకు అడుగు భాగాన తల్లి, పిల్ల పురుగులు గుంపులు గుంపులుగా చేరి రసాన్ని పీలుస్తాయని చెప్పారు. తెల్లదోమలోని వైరస్ క్రిములు లాలాజలం ద్వారా ఆరోగ్యవంతమైన మొక్కలకు కూడా వ్యాపిస్తాయని వివరించారు. అధిక తేమ, వర్షాభావ పరిస్థితుల్లో తెల్లదోమ పెరుగుతుందని సూచించారు. తెగులు ఆశించిన మొక్కలు ముడుచుకుని పడవ ఆకారంలోకి మారి, ఆకులపై బొబ్బర్లు ఏర్పడటంతో పాటు పాలిపోయి లేత ఆకుపచ్చ రంగుకు మారుతాయని తెలిపారు. కణుపుల మధ్య దూరం తగ్గి మొక్కలు గిడసబారతాయని చెప్పారు. వైరస్ తెగుళ్లకు నివారణ లేదని, సస్యరక్షణ పద్ధతులే మార్గమని బేబి సూచించారు. ముందుగా రసం పీల్చు పురుగుల్ని అరికట్టాలని పేర్కొన్నారు. సమగ్ర సస్యరక్షణ చర్యల్లో భాగంగా రైతులు సామూహికంగా నీలి, తెలుపు, పసుపు రంగు జిగురు అట్టలు ఎకరాకు 40–50 వరకు మొక్క ఎత్తుకు దగ్గరగా పెట్టుకోవాలని సూచించారు. వేప సంబంధిత పురుగు మందులు ఐదు శాతం, వేపగింజల కషాయం, వేపనూనె పిచికారీ చేయాలని తెలిపారు. వేపనూనెను సిఫారసు చేసిన ఇతర మందులతో కలిపి పిచికారీ చేసుకోవచ్చని వివరించారు. ఎసిటామిప్రిడ్ 0.3 గ్రాములు లేదా థయోమిథాక్సమ్ 0.4 గ్రాములు, డైఫెన్‌థియూరాన్ 1.25 గ్రాములు లేదా స్పైరోమెఫిసిన్ ఒక మిల్లీలీటరు ఒక లీటరు నీటికి కలిపి మార్చి మార్చి పిచికారీ చేసుకోవాలని సూచించారు. ఆమె వెంట రైతు భరోసా కేంద్రం సిబ్బంది వంశీ, సిరాజ్, రైతులు ఉన్నారు.

కృష్ణా జలాలపై గెజిట్‌ను కేంద్రం ఉపసంహరించుకోవాలి

పెదకాకాని: కృష్ణా జలాలపై కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన గెజిట్‌ను ఉపసంహరించుకోవాలని సీపీఐ పొన్నూరు నియోజకవర్గ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ డిమాండ్ చేశారు. పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం పెదకాకాని సెంటర్‌లో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ఈనెల 20, 21 తేదీల్లో విజయవాడలోని ధర్నా చౌక్ వద్ద 30 గంటల నిరసన దీక్షను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కృష్ణా జలాల పునఃపంపిణీపై కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ రంగాన్ని నాశనం చేసే పద్ధతుల్లో ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో గెజిట్ నోటిఫికేషన్‌ను కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు, రాష్ట్రాన్ని విడదీసేటప్పుడు బీజేపీ ప్రత్యేక హోదా ఇస్తామని తెలిపిందని, ఇప్పుడు ఇవ్వకుండా అన్యాయం చేస్తోందని విమర్శించారు. ఇప్పుడు ఓట్లు దండుకోవడం కోసం తెలంగాణకు మేలు చేసే విధంగా కృష్ణా జలాల గెజిట్‌ను ప్రవేశపెట్టడం అన్యాయమని ఖండించారు.

'ముంజంపల్లి'కి సేవారత్న అవార్డు



అవార్డును అందజేస్తున్న మచిలీపట్నం డీఎస్పీ శ్రీహరి

గుంటూరు మెడికల్: వరల్డ్ ఆక్యుపంచర్ డే సందర్భంగా మచిలీపట్నం డీఎంఎస్ ఎస్వీహెచ్ కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్‌లో బుధవారం వేడుకల్ని ఘనంగా నిర్వహించారు. సామాజిక బాధ్యతగా పలు రంగాల్లో సేవలందించిన వారికి అవార్డుల్ని అందజేశారు. అందులో భాగంగా నగరానికి చెందిన ఆక్యుపంచరిస్ట్ డాక్టర్ ముంజంపల్లి శివకుమార్‌కు 'ఆక్యు కి సేవారత్న' అవార్డును అందజేశారు. కార్యక్రమంలో మచిలీపట్నం డీఎస్పీ శ్రీహరి, డాక్టర్ మాకాల సత్యనారాయణ పాల్గొన్నారు.

గైనకాలజీ విభాగానికి వైద్య పరికరం వితరణ



గుంటూరు మెడికల్: జీజీహెచ్ గైనకాలజీ విభాగానికి రూ. 85వేలు ఖరీదు చేసే కార్డియో టోకోగ్రఫీ పరికరాన్ని ఆసుపత్రి గ్రేడ్–2 నర్సింగ్ సూపరింటెండెంట్ సమీనా బేగం, షరీఫ్ దంపతులు బుధవారం ఆసుపత్రి డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ వైద్యపరికరం ద్వారా గర్భంలోని శిశువుల హార్ట్ బీట్ ఎంత వరకు కొట్టుకుంటుందో తెలుసుకోవచ్చని చెప్పారు. వైద్య పరికరం అందజేసిన నర్సింగ్ సూపరింటెండెంట్ దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సివిల్ సర్జన్ ఆర్ఎంవో డాక్టర్ బత్తుల సతీష్‌కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ కె.ఆశాసజని, ఏఆర్ఎంవో డాక్టర్ గాయత్రి, అడ్మినిస్ట్రేటర్ ప్రవీణ్‌కుమార్, బయో మెడికల్ ఇంజినీర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

గుంటూరు రూరల్: రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన మంగళవారం అర్ధరాత్రి నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ సీహెచ్. రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పు గోదావరి జిల్లా రంపచోడవరానికి చెందిన కురపం సూరిబాబు (25) మిర్చి యార్డు వద్ద కూలీ పనులు చేసుకుని జీవిస్తుంటాడు. యార్డు సమీపంలో రాత్రి రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ప్రమాదంలో తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటన విషయం తెలిసిన నల్లపాడు పోలీసులు, ట్రైనీ డీఎస్పీ గీతాకుమారి సంఘటన స్థలికి చేరుకుని వివరాల్ని సేకరించారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి, మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని నల్లపాడు పోలీసులు తెలిపారు.

అయ్యప్ప స్వాములకు సద్ది వితరణ ప్రారంభం



హారతి పట్టి అన్నప్రసాద వితరణ చేస్తున్న లేళ్ల అప్పిరెడ్డి

కొరిటిపాడు: గుంటూరు మార్కెట్ యార్డులోని శ్రీ వరసిద్ధి వినాయకస్వామి ఆలయం ఆవరణలో అయ్యప్ప స్వాములకు సద్ది వితరణను ప్రభుత్వ విప్, మిర్చియార్డు వరసిద్ధి వినాయక దేవస్థానం ఫౌండర్ చైర్మన్ లేళ్ల అప్పిరెడ్డి బుధవారం ప్రారంభించారు. మిర్చి ఫ్యామిలీ, దేవస్థానం కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో స్వాములకు అప్పిరెడ్డి స్వయంగా హారతి పట్టి అన్నప్రసాద వితరణకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 45 రోజుల పాటు స్వాములకు షడ్రసోపేతమైన అన్నప్రసాదాలు అందిస్తామని తెలిపారు. అయ్యప్పస్వాములంతా సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మిర్చి యార్డు వైస్ చైర్మన్ షేక్ సుభాని, డైరెక్టర్లు కొత్తపల్లి శివసాంబిరెడ్డి, దాసు, బాల వెంకటరెడ్డి, కొత్తపేట సతీష్, మిర్చి యార్డు సెక్రటరీ ఐ.వెంకటేశ్వరరెడ్డి, వరసిద్ధి వినాయక దేవస్థానం ఆలయ కమిటీ నిర్వాహకులు, మిర్చి ఫ్యామిలీ మెంబర్స్ కుర్రి సాంబిరెడ్డి, యలమంచిలి పుల్లారావు, కొత్తూరి సుధాకర్, లేళ్ల పెద అప్పిరెడ్డి, కొత్తూరి సుధాకర్, సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, పాదిలి శ్రీనివాసరావు, టీవీ పవన్ కుమార్, గోపు శ్రీనివాసరెడ్డి, కార్మిక నేత ఎం.శ్రీనివాసరెడ్డి, బొలిశెట్టి వెంకట రమేష్‌కుమార్ పాల్గొన్నారు.

ఏఎన్‌యూని సందర్శించిన హెల్త్ యూనివర్సిటీ వీసీ



హెల్త్ యూనివర్సిటీ వీసీ బాబ్జీని సన్మానిస్తున్న ఏఎన్‌యూ వీసీ రాజశేఖర్

ఏఎన్‌యూ: డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ వీసీ ఆచార్య కె. బాబ్జి బుధవారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. వీసీ ఆచార్య పి రాజశేఖర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా యూనివర్సిటీలో నిర్వహిస్తున్న ఎంబీఏ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ కోర్సు వివరాల్ని విభాగాధిపతి డాక్టర్ బి. నాగరాజు ఆయనకు తెలియజేశారు.భవిష్యత్తులో కోర్సు నిర్వహించే ఇతర కార్యక్రమాలకు హెల్త్ యూనివర్సిటీ నుంచి అధ్యాపకుల్ని భాగస్వాముల్ని చేస్తామని వీసీ బాబ్జి చెప్పారు. రిజిస్ట్రార్ ఆచార్య కరుణ, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి. సిద్ధయ్య, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ. ప్రమీలారాణి, ఎంబీఏ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ అధ్యాపకులు డాక్టర్ పి. శ్రీనివాస్, డాక్టర్ ప్రసాద్, డేవిడ్ రాజు , డాక్టర్ శ్రీధర్, డాక్టర్ సాధిక్ పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో నైతిక విలువలు, వ్యక్తిత్వ వికాసం



ప్రదర్శనలో పుస్తకాలను తిలకిస్తున్న గుళ్లపల్లి సుబ్బారావు, ఝాన్సీలక్ష్మి



గార్డెన్స్ గ్రంథాలయంలో విద్యార్థులతో శకుంతల, సత్య శిరీష

గుంటూరు ఎడ్యుకేషన్: గ్రంథాలయాల్లో పుస్తక పఠనం ద్వారా నైతిక విలువలు, వ్యక్తిత్వ వికాసం అలవడతాయని గుళ్లపల్లి సేవా సంస్థ మేనేజింగ్ ట్రస్టీ గుళ్లపల్లి సుబ్బారావు పేర్కొన్నారు. అరండల్‌పేటలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వారోత్సవాల్లో భాగంగా బుధవారం ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను గుళ్లపల్లి సుబ్బారావు, రచయిత్రి ఏవీకే సుజాత ప్రారంభించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ గ్రంథాయాల్లోని పుస్తకాలు చదవడం ద్వారా విజ్ఞానాన్ని అభివృద్ధి పరచుకోవాలని సూచించారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న నిరుద్యోగ ఉద్యోగార్థులకు అవసరమైన పుస్తకాలను గ్రంథాలయానికి ఉచితంగా అందజేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా సంస్థ జిల్లా కార్యదర్శి కె.ఝాన్సీలక్ష్మి మాట్లాడుతూ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన వ్యాసరచన పోటీలకు వివిధ పాఠశాలలు, కళాశాలల నుంచి 150 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ ఎం. సీతారామయ్య, గ్రంథ పాలకులు ఎన్. నాగిరెడ్డి, సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

గార్డెన్స్ గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన

బృందావన్ గార్డెన్స్‌లోని మహిళా, బాలల గ్రంథాలయంలో బుధవారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను ప్రముఖ న్యాయవాది ఎం. మృత్యుంజయరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలల విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె.ఝాన్సీలక్ష్మి, ఏవీకే సుజాత, గ్రంథాలయాధికారులు బి. శకుంతల, పి. సత్య శిరీష, సిబ్బంది పి. కోటేశ్వరి, పి. సుధాకర్‌రావు, పాఠకులు పాల్గొన్నారు.

- ఎస్వీఎన్ కాలనీలోని శాఖా గ్రంథాలయంలో వారోత్సవాల ప్రాముఖ్యతను తెలియజేస్తూ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె.ఝాన్సీలక్ష్మి మాట్లాడుతూ రెగ్యులర్‌గా గ్రంథాలయాలకు వచ్చి పుస్తకాలను చదివే అలవాటు చేసుకోవాలని, తద్వారా విజ్ఞానం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను విద్యార్థులు, పాఠకులు తిలకించారు. కార్యక్రమంలో రికార్డు అసిస్టెంట్ బి. వెంకాయమ్మ, చిన్మయ స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీజేపీ ఓబీసీ మోర్చా నూతన కమిటీ నియామకం



నూతన కార్యవర్గంతో జిల్లా అధ్యక్షుడు నరేంద్ర

గుంటూరు మెడికల్: బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు పిల్లిమిల్లి రామకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం గుంటూరులోని బీజేపీ జిల్లా కార్యాలయంలో అధ్యక్షుడు వనమా నరేంద్ర సమక్షంలో ఓబీసీ మోర్చా నూతన కమిటీని ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా కామేపల్లి వెంకటేశ్వర్లు, దాసరి రమేష్, మాదా వెంకటకృష్ణ, మల్లిబోయిన సాయికృష్ణ, ప్రధాన కార్యదర్శులుగా మోషె వెంకటశేషగిరిరావు, కె.కృష్ణ , కార్యదర్శులుగా పి.వెంకటేశ్వర్లు, ఉడుముల రాంబాబు, కాకర్ల వీరేంద్రకుమార్, ముద్రబోయిన నాగరాజు, రవికిరణ్, కోశాధికారిగా ఆరె.వెంకట్రావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు పిల్లిమిల్లి రామకృష్ణ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ 140 బీసీ కులాల్లో 18 కుల చేతివృత్తిదారులకు మేలు జరిగేలా విశ్వకర్మ కౌశల్ యువజన పథకాన్ని ప్రకటించారని తెలిపారు. దీని ద్వారా లబ్ధి పొంది బీసీల కుటుంబ ఆర్థిక పరిస్థితి మెరుగు పరుచుకోవచ్చని సూచించారు.

తెలుగు జాతి గర్వించదగ్గ మహా నటుడు కృష్ణ



కృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న అవగాహన సంస్థ సభ్యులు

లక్ష్మీపురం: తెలుగు జాతి గర్వించదగ్గ మహానటుడు, బుర్రిపాలెం బుల్లోడు సూపర్‌స్టార్ కృష్ణ అని అవగాహన సంస్థ సభ్యులు కొనియాడారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో బుధవారం సూపర్‌స్టార్ కృష్ణ వర్ధంతి సభ నిర్వహించారు. కృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కృష్ణ అభిమాని బిళ్లా అశోక్ మాట్లాడుతూ తెలుగు చిత్రసీమ ఉన్నంత వరకు ప్రజల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న ఏకైక హీరో కృష్ణ అని తెలిపారు. ఐదు దశాబ్దాల సినీ జీవితంలో విభిన్న పాత్రల్లో నటించారని చెప్పారు. సంగీత విద్వాంసులు ఎస్.ఎస్.మల్లేశ్వరరావు మాట్లాడుతూ నటుడుగా, నిర్మాతగా, దర్శకుడిగా స్టూడియో అధినేతగా సినీరంగానికి పలు సేవలు అందించిన ఘనత కృష్ణకే దక్కుతుందని వివరించారు. కార్యక్రమంలో కొండా శివరామిరెడ్డి, కోటిరెడ్డి, మాధవి, మూర్తి, నారాయణ పాల్గొన్నారు.

వీవీఎం–2023లో ముట్లూరు విద్యార్థుల ప్రతిభ



ప్రత్తిపాడు: విద్యార్థి విజ్ఞాన మంథన్ (వీవీఎం–2023) పోటీల్లో వట్టిచెరుకూరు మండలం ముట్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. అక్టోబరు 29న జిల్లాస్థాయిలో నిర్వహించిన వీవీఎం– 2023 పరీక్షకు ముట్లూరు హైస్కూలు నుంచి 93 మంది విద్యార్థులు హాజరయ్యారు. వారిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఆరో తరగతి విద్యార్థిని దేవరకొండ కరుణ రాష్ట్రస్థాయి పరీక్షకు ఎంపికైంది. జిల్లాస్థాయిలో ఇదే పాఠశాలకు చెందిన విద్యార్థులు తోటకూర మహాలక్ష్మి (7వ తరగతి), దూపాటి రవితేజ (8వ తరగతి), మేడికొండూరు గ్రీష్మ (9వ తరగతి), సుఖవాసి రిషిత (9వ తరగతి) ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. ఈ సందర్భంగా బుధవారంపాఠశాలలో జరిగిన కార్యక్రమంలో హెచ్ఎం తెనాలి జోస్ మేరి, నోడల్ ఎంఈవో కె. శ్రీనివాసరెడ్డి విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు. విద్యార్థులకు గైడ్ టీచర్లుగా కె. శ్రీనివాసరావు, వి.ఎస్. రామాంజనేయులు, కె. మల్లేశ్వరరావు వ్యవహరించారు.